కబ్జారాయుళ్లా.. మజాకా..!

- జగిత్యాలలో పెట్రేగిపోతున్న భూ అక్రమార్కులు
- ఏకంగా పెండ్లికాని మహిళకు భర్తను, బిడ్డను సృష్టించి పత్రాలు
- తప్పుడు డెత్, ఫ్యామిలీ సర్టిఫికెట్లతో కోట్ల విలువైన బిల్డింగ్ విక్రయం
- ఆలస్యంగా వెలుగులోకి బాగోతం
- లబోదిబోమంటున్న బాధిత కుటుంబం
- ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తేనే రిజిస్ట్రేషన్ చేశాం : సబ్ రిజిస్ట్రార్
- ఫేక్ అని తేలితే చర్యలు తప్పవని స్పష్టీకరణ

తప్పుడు పత్రాలతో విక్రయించిన ఇల్లు ఇదే

భూ మాఫియాతో జగిత్యాల ప్రాంతం బెదిరిపోతున్నది. కొద్ది రోజులుగా కబ్జారాయుళ్ల ఆక్రమణలతో వణికిపోతున్నది. స్థలాల నుంచి మొదలుకొని భవనాల వరకు వదిలి పెట్టకుండా తప్పుడు పత్రాలతో సొంతం చేసుకుంటూ పోతుండగా, ప్రజానీకం బెంబేలెత్తిపోతున్నది. యజమానుల పేరిట ఉన్న స్థలాలు వాళ్లకు తెలియకుండానే ఇతరుల పేరుపైకి మారిపోతుండడం సంచలనం సృష్టిస్తున్నది. తాజాగా అలాంటి ఘటనే వెలుగు చూసింది. ఓ ప్రభుత్వోద్యోగి అయిన అవివాహిత అనారోగ్యంతో చనిపోతే ఆమెకు సంబంధించిన కోట్ల రూపాయల విలువచేసే ఇంటిని తప్పుడు పత్రాలతో కొట్టేసిన ఉదంతం కలకలం రేపుతున్నది. సదరు మహిళకు ఏకంగా భర్తను, బిడ్డను సృష్టించి, తప్పుడు మార్గంలో డెత్ సర్టిఫికెట్, ఫ్యామిలీ సర్టిఫికెట్‌నూ పొంది భవనాన్ని రిజిస్ట్రేషన్ చేసుకోవడం పరిస్థితికి అద్దం పడుతున్నది.

జగిత్యాల, జూన్ 19(నమస్తే తెలంగాణ): జగిత్యాల ప్రాంతం కబ్జారాయుళ్లకు కేరాఫ్ అడ్రస్‌గా మారిపోతున్నది. ఇటీవల డబుల్ రిజిస్ట్రేషన్లు, కబ్జాల వ్యవహారం మరిచిపోకముందే తాజాగా మరో సంఘటన వెలుగు చూసింది. పెండ్లి కాకుండానే మృతిచెందిన ఓ ప్రభుత్వోద్యోగికి ఓ భర్తను, ఓ కూతురును సృష్టించి ఆమె ఇంటినే సొంతం చేసుకున్నట్టు తెలుస్తున్నది. వివరాల్లోకి వెళితే.. వరంగల్ జిల్లా శాయంపేటకు చెందిన చంద్రలీల-ల్యూక్ దంపతులకు వొడ్డెపెల్లి సుందరమ్మ, మాధుర్యం, వరమ్మ ముగ్గురు కూతుర్లు. ఈ ముగ్గురు వైద్య ఆరోగ్య శాఖలో పనిచేసేవారారు. మాధుర్యం ఉద్యోగ రీత్యా 40 ఏండ్ల కింద జగిత్యాలకు వచ్చి, ఇక్కడే వివాహం చేసుకొని స్థిరపడింది. సుందరమ్మ పెండ్లి చేసుకొని హైదరాబాద్‌లో సెటిల్ కాగా, వరమ్మ వివాహం చేసుకోకుండానే ఉండిపోయింది. అక్క సహకారం ఉంటుందన్న ఉద్దేశంతో వరమ్మ జగిత్యాలకు బదిలీ చేసుకొని, ఇక్కడే స్థిరపడిపోయింది.

13 ఏళ్ల కింద ఇంటి నిర్మాణం

స్టాఫ్‌నర్స్ అయిన వరమ్మ 2011లో ధరూర్ గ్రామంలో సర్వేనంబర్ 25/ఆ లో 193.50 చదరపు గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ డ్యాకుమెంట్ నెంబర్ 3625/2011 ద్వారా కొనుగోలు చేసింది. ఆ తర్వాత 2015లో ఆ స్థలంలో ఇంటి నిర్మాణానికి ధరూర్ గ్రామ పంచాయతీ అనుమతి పొంది భవన నిర్మాణం చేపట్టింది. ఈ క్రమంలో అనారోగ్యంతో తీవ్ర అస్వస్థతకు గురైన వరమ్మ 2015 జూలై 4న మృతిచెందింది. వరమ్మకు పెళ్లి కాకపోవడం, ఆమె తల్లిదండ్రులు 30 ఏండ్ల క్రితమే మరణించడంతో ఇద్దరు అక్కలు సుందరమ్మ-మాధుర్యం లీగల్‌గా వారసులయ్యారు. వరమ్మకు సంబంధించిన డెత్ సర్టిఫికెట్‌ను జగిత్యాల మున్సిపల్ ఆఫీస్ నుంచి 2015 అక్టోబర్ 6న పొందారు. జగిత్యాల తహసీల్ ఆఫీస్ నుంచి వరమ్మకు లీగల్ వారసులుగా ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్‌ను 2016 సెప్టెంబర్ 9న పొందారు. ఈ సర్టిఫికెట్లతో వరమ్మ జనరల్ ప్రావిడెంట్ ఫండ్‌తో పాటు ఇతర ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక ప్రయోజనాలను పొందడానికి ఇద్దరు అక్కలూ ప్రయత్నించారు. అయితే సంబంధిత శాఖ అధికారులు, వరమ్మకు లీగల్‌గా సుందరమ్మ, మాధుర్యం మాత్రమే వారసులంటూ న్యాయస్థానం నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని, అప్పుడే వరమ్మకు సంబంధించిన అన్ని ప్రయోజనాలు ఇస్తామని తేల్చిచెప్పారు. దీంతో ఇద్దరు అక్కలు జగిత్యాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టును 2017లో (ఓ.ఎస్.నెంబర్. 259/2017) ఆశ్రయించారు. న్యాయస్థానం వరమ్మకు సంబంధించిన సర్వీస్‌బుక్‌తోపాటు ఆమె ఇతర సర్టిఫికెట్లను పరిశీలించి తీర్పును వెలువరించారు. వరమ్మకు వివాహం కాలేదని, ఆమె ఎవరిని దత్తత తీసుకోలేదని, ఆమె తల్లిదండ్రులు గతంలోనే చనిపోయిన నేపథ్యంలో తోబుట్టువులు సుందరమ్మ, మాధుర్యం లీగల్‌గా వారసులంటూ ధ్రువీకరించారు. న్యాయస్థానం ఇచ్చిన ధ్రువీకరణ పత్రం, డెత్ సర్టిఫికెట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ల ఆధారంగా చెల్లెలికి సంబంధించిన ఉద్యోగ ప్రయోజనాలను ఇద్దరు అక్కలు పొందారు. వరమ్మ ధరూర్‌లో నిర్మించిన ఇంటిని స్వాధీనం చేసుకునేందుకు అక్కాచెల్లెండ్లు ప్రయత్నించారు. అయితే వరమ్మ ఇంటి నిర్మాణ కాంట్రాక్టు తనకే ఇచ్చిందని, నిర్మాణం చేశానని, డబ్బులు ఇవ్వకుండానే చనిపోయిందని, డబ్బులు ఇవ్వాలంటూ సుందరమ్మ, మాధుర్యంతో జగిత్యాలకు చెందిన ఒక ప్రముఖ సివిల్ ఇంజినీర్ గొడవకు దిగాడు. దీంతో ఇంటి స్వాధీనం కొన్నాళ్లుగా పెండింగ్‌లో పడిపోయింది.

తప్పుడు సర్టిఫికెట్లతో ఇంటి రిజిస్ట్రేషన్

సివిల్ ఇంజినీర్, వరమ్మ అక్కల మధ్య తలెత్తిన వివాదం ఓవైపు జరుగుతుండగానే ఓ కబ్జారాయుడు, మరో మహిళ కలిసి ఇంటిని దక్కించుకునేందుకు వ్యూహం రచించారు. జగిత్యాల రూరల్ మండలం హైదర్‌పల్లికి చెందిన పల్లికొండ జ్యోతి.. వొడ్డెపెల్లి వరమ్మ తనకు తల్లి అని, తన తండ్రి పేరు వొడ్డెపెల్లి నాయుడు అంటూ ఒక ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను సృష్టించింది. అలాగే జగిత్యాల మున్సిపల్ ఆఫీస్ నుంచి వరమ్మ పేరుపై మరో డెత్ సర్టిఫికెట్‌ను సృష్టించింది. వీటి ఆధారంగా వరమ్మ తన తల్లి అని, తండ్రి నాయుడు గతంలోనే చనిపోయాడని, లీగల్‌గా తానే ఏకైక వారసురాలిని అంటూ, వరమ్మకు చెందిన ఇంటిని గతేడాది డిసెంబర్ 2న జగిత్యాల సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో ఉల్లెంగ చిన్నబావులు అనే వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేసింది. ఈ రిజిస్ట్రేషన్‌కు బీర్‌పూర్ మండలం తుంగూర్‌కు చెందిన ఎం గంగరాజం, ఎం శంకర్ సాక్షులుగా వ్యవహరించారు.

బిత్తరపోతున్న వరమ్మ రక్తసంబంధీకులు

రెండుమూడు రోజుల క్రితం అనుమానం వచ్చిన మాధుర్యం రిజిస్ట్రేషన్ ఆఫీస్‌కు వెళ్లి వరమ్మకు సంబంధించిన హౌస్ నంబర్‌పై ఈసీ తీయడంతో ఇంటిని ఇతరుల పేరుపై రిజిస్ట్రేషన్ చేసిన విషయం బయటపడింది. దీంతో హతాశులైన మాధుర్యం కుటుంబ సభ్యులు రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన పత్రాలు తీసుకోవడంతో అసలు మోసం వెలుగులోకి వచ్చింది. అవివాహిత అయిన వరమ్మకు నాయుడు అనే భర్త పేరును సృష్టించి, జ్యోతి అనే కూతురిని సృష్టించి ఇంటిని రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో వారు బిత్తరపోయారు. అసలు వారసులైన తమకు తెలియకుండా పల్లికొండ జ్యోతి అనే మహిళ ఏకంగా వరమ్మ కూతురిగా పేర్కొంటూ రిజిస్ట్రేషన్ చేసుకోవడంపై వారు కొంత సమాచారాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయగా, అనేక ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగుచూసి నివ్వెరపోయారు. పల్లికొండ జ్యోతి అనే మహిళ హైదర్‌పల్లికి చెందిన వ్యక్తి అన్న ఆధార్‌కార్డు ఆధారంగా విచారించగా, జ్యోతికి గతంలోనే గుల్లపేటకు చెందిన గంగాధర్‌తో వివాహమైందని, అతను కొన్నేండ్ల క్రితం చనిపోయినట్లు తెలిసింది. ఇక జ్యోతి తల్లిదండ్రులు జుంబర్తి నర్సయ్య-దుబ్బమ్మ అని తెలిసింది. జ్యోతి హైదర్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి వరకు చదివినట్లు తెలుస్తున్నది. ఆమె స్టడీ వివరాలు, అడ్మిషన్ రికార్డు కోసం ప్రయత్నించగా, 1997కు ముందు అడ్మిషన్ రిజిస్టర్లు అందుబాటులో లేక సాధ్యపడలేదు.

దొరికిపోయిన దొంగలు

అయితే తప్పుడు ధ్రువపత్రాలతో ఇంటి రిజిస్ట్రేషన్ చేసిన వాళ్లు అనేక తప్పిదాలతో దొరికిపోయారు. వారు రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో అందజేసిన ఫ్యామిలీ సర్టిఫికెట్‌తో పాటు డెత్ సర్టిఫికెట్ రెండు నకిలీవే అని అధికారులు చెబుతున్నారు. ధ్రువపత్రాలపై జారీ చేసిన కార్యాలయాల ధ్రువపత్రాల నంబర్లు ఉండాల్సి ఉండగా, అవి కనిపించడం లేదని పేర్కొంటున్నారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌లో వొడ్డెపెల్లి వరమ్మ తండ్రి పేరు ల్యూక్ అని పేర్కొన్న వ్యక్తులు, ఆమె భర్తపేరు లేట్ వొడ్డెపెల్లి నాయుడు అని పేర్కొన్నారు. వడ్డెపెల్లి ల్యూక్ కూతురైన వరమ్మకు అదే ఇంటిపేరు ఉన్న వొడ్డెపెల్లి నాయుడు భర్త ఎట్టిపరిస్థితుల్లో కాడని నిపుణులు చెబుతున్నారు. వరమ్మకు సంబంధించిన ప్రావిడెంట్ ఫండ్ ఇతర ఉద్యోగ ప్రయోజనాలు పొందని జ్యోతి, ఇంటిని మాత్రం దక్కించుకునేందుకు తప్పుడు మార్గం తొక్కిందన్న విషయం స్పష్టంగా తెలుస్తుందంటున్నారు.

సర్టిఫికెట్ల ఆధారంగానే రిజిస్ట్రేషన్ చేశాం

రిజిస్ట్రేషన్ ప్రక్రియకు డెత్ సర్టిఫికెట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లను పల్లికొండ జ్యోతి అందజేసింది. వాటి ఆధారంగా మేం రిజిస్ట్రేషన్ చేశాం. ధ్రువీకరణ పత్రాలు లేకపోతే రిజిస్ట్రేషన్ చేసే అవకాశమే లేదు. పొందుపర్చిన ధ్రువపత్రాల్లో ఏవి నకిలీ, ఏవి నిజమైనవి అన్న విషయం తేల్చడం చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. ఒకవేళ జ్యోతి తప్పుడు సర్టిఫికెట్లతో రిజిస్ట్రేషన్ చేసినట్లు రుజువైతే చర్యలు తీసుకుంటాం. రిజిస్ట్రేషన్ సైతం క్యాన్సల్ చేసే అవకాశం ఉంటుంది.

- కిషన్ నాయక్, సబ్ రిజిస్ట్రార్ జగిత్యాల

విద్యార్థులను సన్మానిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

రూ.30 కోట్లతో స్కూళ్లల్లో వసతులు

- కాటారం ఐటీఐ కాలేజీ అభివృద్ధికి ₹6 కోట్లు
- పదిహేను రోజుల్లో మంథని-మంచిర్యాల వంతెనకు శంకుస్థాపన
- మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, జూన్ 19: పెద్దపల్లి జిల్లాలోని 478 ప్రభుత్వ పాఠశాలల్లో ₹30 కోట్లతో మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. రాష్ట్రంలోని 65 ఐటీఐ కాలేజీలను ఆధునాతన సాంకేతిక కేంద్రాలు(ఏటీసీ)గా అభివృద్ధి చేస్తున్నామని, అందులో కాటారం ఐటీఐకి ₹6 కోట్లు కేటాయిస్తామని వెల్లడించారు. మంథని జడ్పీస్కూల్‌లో గురువారం మంత్రి బడిబాట ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి మంత్రి హాజరయ్యారు. అనంతరం తరగతి గదులు, లంచ్‌రూమ్, స్పోర్ట్స్ వింగ్, ల్యాబ్, లైబ్రరీ, టాయిలెట్లను పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ స్కూళ్ల అభివృద్ధి, మెరుగైన విద్యనందించడంపై కలెక్టర్లు దృష్టి పెట్టాలని సూచించారు. పిల్లలపై శ్రద్ధ చూపే తల్లులకు అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలల అభివృద్ధి బాధ్యతలను అప్పగించాలన్నారు. ప్రభుత్వం మెరుగైన వసతులు కల్పించడంతో 984 మంది ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులు సర్కారు బడుల్లో చేరారని తెలిపారు. మంథని జడ్పీ స్కూల్‌లో క్రీడాపరికరాలను సమకూర్చి ప్రతి బుధవారం స్పోర్ట్ యూనిఫాంతో హాజరయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న హెచ్ఎం, టీచర్లను మంత్రి అభినందించారు. ప్రభుత్వ స్కూళ్లల్లో చదివిన చాలా మంది గొప్ప స్థానాలకు చేరుకున్నారని, జిల్లా స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్, పోలీస్, ఇతర అధికారులు కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నారని చెప్పారు. స్కూళ్లల్లో డిజిటల్ లైబ్రరీలను ఏర్పాటు చేస్తామన్నారు. పచ్చదనం పెంపునకు ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. యువతకు ఉపాధి కల్పనకు మంథనిలో కోకోకోలా, సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. పదిహేను రోజుల్లో మంథని-మంచిర్యాలలో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని చెప్పారు. మంథని, సెంటినరీకాలనీ సమీపంలో ఫోర్‌లేన్ రహదారి నిర్మిస్తున్నామన్నారు. అనంతరం 10 జీపీఏ సాధించిన విద్యార్థులను అభినందించారు. వారికి పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో హనుమానాయక్, ఎంపీపీ కొండ శంకర్, మంథని బల్దియా చైర్ పర్సన్ పెండ్రు రమ, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీపతి బాణయ్య, డీఈవో డీ మాధవి, డీఆర్‌డీవో రవీందర్‌రాథోడ్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామి, జడ్పీ సీఈవో నరేందర్, తహసీల్దార్ రాజయ్య, హెచ్ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని అభినందిస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ సిబ్బంది సేవలు భేష్

తెలంగాణచౌక్,జూన్19: కరీంనగర్ అంబేద్కర్ బస్టాండ్‌లో ఈ నెల 16న ఒడిశా కూలీకి పురుడు పోసిన ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సైదమ్మ, రేణుక, భవాని, లావణ్యను బుధవారం హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో ఆర్టీసీ వైస్ చైర్మన్, ఎండీ సజ్జనార్ శాలువాలు కప్పి సత్కరించారు. సకాలంలో స్పందించి సత్వరమే బస్టాండ్‌కు చేరుకున్న '108' ఏటీఎం రజనీకృష్ణ, స్టేషన్ మేనేజర్ అంజయ్యను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఏదేని పరిస్థితుల్లో బస్టాండ్లు, ఆర్టీసీ బస్సుల్లో జన్మించిన చిన్నారులకు జీవితకాలం ఫ్రీ బస్ సౌకర్యం కల్పిస్తామని ప్రకటించారు. కరీంనగర్ బస్టాండ్‌లో జన్మించిన పాపకు లైఫ్‌టైం ఫ్రీ బస్‌పాసును అందించనున్నామని వెల్లడించారు.

అమ్మకానికి 60 బొగ్గు గనులు

హైదరాబాద్ వేదికగా రేపు వేలం వేయనున్న కేంద్రం



హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం మరోసారి వాణిజ్య బొగ్గు గనులను వేలం వేయనున్నది. ఈసారి ఇందుకు హైదరాబాద్ వేదిక అవుతున్నది. గతంలో ఢిల్లీ, ముంబై, బెంగళూరు తదితర నగరాల్లో నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే ఈ 10వ విడుత కోల్ బ్లాక్స్ వేలాన్ని మాత్రం ఇక్కడ చేపడుతున్నారు. దీనిలో భాగంగానే శుక్రవారం (ఈ నెల 21) దేశవ్యాప్తంగా ఉన్న 60 బొగ్గు బ్లాక్‌లను మోదీ సర్కారు అమ్మకానికి తెస్తున్నది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి వేలం ప్రక్రియను ప్రారంభిస్తారు. ఆ శాఖ సహాయ మంత్రి సతీష్ చంద్ర దూబే, కార్యదర్శి అమృత్ లాల్ మీనాతోపాటు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఎంఎస్‌టీసీ ప్లాట్‌ఫామ్‌పై వేలానికి సంబంధించిన వివరాలను పొందుపర్చారు. పర్సంటేజ్ రెవెన్యూ షేర్ మాడల్ ఆధారంగా ఆన్‌లైన్‌లో బొగ్గు గనుల వేలాన్ని నిర్వహిస్తారు. ఇక ఈ గనుల్లో కోకింగ్, నాన్-కోకింగ్ బొగ్గు బ్లాకులున్నాయి.

సింగరేణి పాల్గొనేనా..

ఈ బొగ్గు బ్లాక్‌ల వేలంలో సింగరేణి పాల్గొంటుందా? లేదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించిందా? లేదా? అన్నది కూడా స్పష్టత రావాల్సి ఉన్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణి నాడు వేలానికి దూరంగా ఉన్నది. కాగా, తెలంగాణలోని శ్రావణపల్లి బ్లాక్‌లో జీ-10 గ్రేడ్ బొగ్గు లభ్యమవుతుండగా, ఇక్కడ 119 మిలియన్ టన్నుల నిల్వలే ఉన్నట్టు తేల్చారు. దీంతో ఈ బ్లాక్‌పట్ల సింగరేణి ఆసక్తి చూపడం లేదు. ఆర్థికంగా అంత శ్రేయస్కరం కాదన్న భావనలో అధికారులున్నారు. ఇదే విషయంపై సింగరేణి సీఎండీ బలరాంను 'నమస్తే తెలంగాణ' సంప్రదించగా.. ఆర్థికంగా ఉన్న సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేస్తున్నామన్నారు. తర్వాతే వేలంలో పాల్గొనాలా? వద్దా? అన్నది నిర్ణయిస్తామన్నారు.

వేలాన్ని అడ్డుకుంటాం: రాజిరెడ్డి

బొగ్గు బ్లాకుల వేలాన్ని అడ్డుకొని సింగరేణిని కాపాడుకుంటామని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ప్రకటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బొగ్గు బ్లాక్‌లతోపాటు ఇతర ఖనిజ నిల్వలను వేలం వేయకుండా కాపాడిన విషయాన్ని కార్మికులు గమనించాలని, ప్రైవేటీకరణను ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించబోమని ఆయన స్పష్టంచేశారు. వేలం వేస్తే ఇటీవల కొత్తగా ఉద్యోగాల్లో చేరిన 20 వేల మంది కార్మికుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుందన్నారు.

1.56 లక్షల కోట్లు

గత ఆర్థిక సంవత్సరం ప్రైవేట్‌పరమైన ప్రభుత్వ ఆస్తుల విలువ



వాటాల విక్రయం, డివిడెండ్లతో..

అందినకాడికి అమ్ముకుంటూపోతున్న మోదీ సర్కారు.. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ (సీపీఎస్ఈ)ల్లో వాటాల విక్రయం ద్వారా, ఆయా కంపెనీలిచ్చే డివిడెండ్లతో కూడా ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నది. ఇప్పటికే చాలా సంస్థల్లో వాటాలను తగ్గించుకున్న కేంద్రం.. ఎయిర్ ఇండియా వంటి సంస్థలను అడ్డగోలుగా మొత్తం విక్రయించిన సంగతి విదితమే. ఇక ఒక్క రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచే గత పదేండ్ల హయాంలో దాదాపు రూ.9 లక్షల కోట్లను డివిడెండ్‌గా అందుకున్నది. గత ఆర్థిక సంవత్సరానికైతే రికార్డు స్థాయిలో ఆర్బీఐ రూ.2.11 లక్షల కోట్ల డివిడెండ్‌ను ప్రకటించినది తెలిసిందే. మిగతా ప్రభుత్వ సంస్థల నుంచీ పెద్ద ఎత్తునే డివిడెండ్ ఆదాయం వస్తున్నది. అయినప్పటికీ కొత్త ఆదాయ మార్గాలను అన్వేషించకుండా ప్రభుత్వ ఆస్తుల అమ్మకాలకే కేంద్రం ఆసక్తి చూపుతుండటం ఇప్పుడు సర్వత్రా విమర్శలపాలవుతున్నది.

ఈ ఆర్థిక సంవత్సరం ఇంకో 2 లక్షల కోట్ల ఆస్తులు ఔట్

న్యూఢిల్లీ, జూన్ 19: గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో జాతీయ నగదీకరణ కార్యక్రమం (ఎన్ఎంపీ) కింద కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు రూ.1.56 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను అమ్మేసింది. నిజానికి రూ.1.80 లక్షల కోట్ల ఆస్తులను విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకోవడం గమనార్హం. బుధవారం వచ్చిన అధికారిక ప్రకటన ప్రకారం 2021-22 నుంచి 2024-25 వరకు మొత్తం నాలుగేండ్లలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని మౌలిక రంగ ఆస్తులను అమ్మి రూ.6 లక్షల కోట్ల నిధులను సమీకరించాలని బీజేపీ సర్కారు నిర్దేశించుకున్నది. ఈ క్రమంలోనే 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాల్లో దాదాపు 2.30 లక్షల కోట్ల ఆస్తులను అమ్మేసింది.

వచ్చే మార్చికల్లా..

2023-24తో కలిపితే మూడేండ్లలో రూ.4 లక్షల కోట్ల ఆస్తులను విక్రయించినట్టవగా, తొలి రెండేండ్లతో పోల్చితే తర్వాతి సంవత్సరంలోనే అత్యధికంగా అమ్మేయడం గమనించదగ్గ అంశం. ఇక లక్ష్యాన్ని చేరుకోవాలంటే వచ్చే మార్చి నాటికి ఇంకా రూ.2 లక్షల కోట్ల విలువైన ఆస్తులను అమ్మాల్సి ఉన్నది. దీంతో త్వరలోనే మరింత సర్కారీ సంపద.. ప్రైవేట్‌పరం కాబోతున్నది. ఇప్పటికే ఎన్‌హెచ్ఏఐ 33 ఆస్తులను కూడా గుర్తించింది. కాగా, రోడ్డు రవాణా-జాతీయ రహదారులు, బొగ్గు, విద్యుత్తు, గనులు, పెట్రోలియం-సహజ వాయువు, పట్టణాభివృద్ధి, షిప్పింగ్ తదితర మంత్రిత్వ శాఖల్లో ఆస్తుల అమ్మకాలకు సంబంధించి పెట్టుకున్న లక్ష్యంలో 70 శాతం పూర్తయినట్టు కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి.

గత ఆర్థిక సంవత్సరం కేంద్రం అమ్మేసిన ప్రభుత్వ ఆస్తులు

శాఖ	విలువ (రూ.కోట్లలో)
రోడ్డు రవాణా, జాతీయ రహదారులు	40,314
బొగ్గు	56,794
విద్యుత్తు	14,690
గనులు	4,090
పెట్రోలియం-సహజ వాయువు	9,587
పట్టణాభివృద్ధి	6,480
షిప్పింగ్	7,627
మరికొన్ని శాఖల్లో	16,500



120 కోట్లు దాటిన టెలికం కస్టమర్లు

న్యూఢిల్లీ, జూన్ 19: టెలికం వినియోగదారులు మళ్లీ 120 కోట్లు దాటారు. ఏప్రిల్ నెల చివరినాటికి దేశవ్యాప్తంగా 120.12 కోట్ల మంది టెలికం సబ్‌స్క్రైబర్లు ఉన్నారని టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. వీరిలో వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్లు 116.54 కోట్ల మంది ఉన్నారు. టెలికం దిగ్గజం రిలయన్స్ జియో దూసుకుపోతున్నది. కొత్తగా జియో నెట్‌వర్క్‌ను 26.8 లక్షల మంది ఎంచుకోవడంతో మొత్తం సంఖ్య 47.24 కోట్లకు చేరుకోగా, అలాగే భారతీ ఎయిర్‌టెల్‌కు 7.52 లక్షల మంది జతవడంతో 26.75 కోట్లకు చేరుకున్నారు.

ఏసీల ధరలకు రెక్కలు

8 శాతం వరకు భారీగా పెరిగిన విలువ

న్యూఢిల్లీ, జూన్ 19: ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుకోవడంతో సామాన్యులు సైతం ఏసీలను కొనుగోలు చేస్తున్నారు. ఈ వేసవి సీజన్‌లో ఏసీల విక్రయాలు రికార్డు స్థాయి రెండంకెల వృద్ధి నమోదైంది. అమ్మకాలు భారీగా పెరుగుతున్నాయన్న అంచనాతో వీటి ఉత్పత్తి సంస్థలు ఇదే అదనుగా ఏకంగా ధరలను కూడా భారీగా పెంచాయి. గతంలోనే ధరలను స్వల్పంగా పెంచిన సంస్థలు జూన్ నెలలో మరోసారి 6 శాతం నుంచి 8 శాతం వరకు సవరించాయి.

ఉత్పత్తి భారీ పెంపు..

డిమాండ్ అధికంగా ఉండటంతో ఏసీల తయారీ సంస్థలు తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని భారీగా పెంచాయి కూడా. సరఫరాలో ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు ఉపక్రమించాయి. టాప్ కంపెనీలైన వొల్టాస్, ఎల్‌జీ, లాయిడ్‌లు ఏకంగా తమ కెపాసిటీని రెండింతలు పెంచుకున్నాయి. ఏసీల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి లాయిడ్ పేరుతో ఏసీలను విక్రయిస్తున్న హావెల్స్ రూ.30-50 కోట్ల వరకు పెట్టుబడి కూడా పెట్టింది.

- ఈ ఏడాది ఏసీల విక్రయాలు 30-40 శాతం వృద్ధితో 1.5 కోట్ల యూనిట్లకు చేరుకుంటుందని ఇండస్ట్రీ వర్గాల అంచనా.
- దక్షిణాది కంటే ఉత్తరాదిలో ఎండలు తీవ్రంగా ఉండటంతో ఏసీ తయారీ సంస్థలు తమ ఏసీ స్టాక్‌లను దక్షిణాది నుంచి ఉత్తరాదికి తరలిస్తున్నారు.
- ఏసీల ఇన్‌స్టాలేషన్- సేవలు అందించే సిబ్బంది కొరత అధికంగా ఉన్నది.
- ఏసీల తయారీ సంస్థలైన వొల్టాస్, హావెల్స్‌లు తమ ఏసీల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించడానికి భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి.
- డిమాండ్ అధికంగా ఉండటంతో విడిభాగాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాయి సంస్థలు. ముఖ్యంగా కంప్రెషర్లు, మోటర్లు, పీసీబీ సర్క్యూట్స్‌లు ఉన్నాయి.

ఈ ఏడాది ఏసీ ఇండస్ట్రీకి గోల్డెన్ ఈయర్. దేశవ్యాప్తంగా అత్యధిక రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో జూన్ నెలలోనూ అమ్మకాలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి.

సంజయ్ చిత్కారా, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్

వాణిజ్య

టాటా కమర్షియల్ వాహనాలు ప్రియం

న్యూఢిల్లీ, జూన్ 19: టాటా మోటర్స్ మరోసారి వాహన ధరలను పెంచింది.